



జిల్లా పశుసంవర్ధక శాఖాధికారిగా రత్నాకర్




ప్రజాశక్తి- పార్వతీపురం రూరల్

జిల్లా పశుసంవర్ధక శాఖ అధికారిగా జె.రత్నాకర్ శుక్ర వారం బాధ్యతలు స్వీకరించారు. ఈ మేరకు కలెక్టర్ నిశాంత్ కుమార్‌ను కలెక్టరేట్‌లో మర్యాద పూర్వకంగా కలుసుకున్నారు. రత్నాకర్ పార్వతీపురం సహాయ సంచాలకులుగా పనిచేస్తూ ఉద్యోగ్నోతిపై జిల్లా పశుసంవర్ధక శాఖ అధికారిగా నియమితులయ్యారు. జిల్లాలో పశుసంవర్ధక అంశాల పట్ల శ్రద్ధ తీసుకోవాలని జిల్లా కలెక్టర్ సూచించారు. పాడిపశువుల సంపద పెంచడమే కాకుండా రైతులకు ఆదాయం పెంపొందించేలా చర్యలు చేపట్టాలని ఆదేశించారు.

విద్యుత్తు కోత.. ఛార్జీల మోత

ఓవైపు విద్యుత్తు కోతలు... మరోవైపు ఛార్జీల మోత వెరసి ప్రజానీకాన్ని ప్రభుత్వం తీవ్ర ఇబ్బందులకు గురిచేస్తోంది. ఏప్రిల్ 1 నుంచి వివిధ రూపాల్లో ఛార్జీలను పెంచిన ప్రభుత్వం వారం రోజులుగా ఎమర్జెన్సీ లోడ్ రిలీఫ్ పేరిట విద్యుత్తు కోతలు ప్రారంభించడంతో జనం ఉక్కిరిబిక్కిరి అవుతున్నారు. డబ్బుపోయే... సుఖమూ లేకపోయే అంటూ ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ప్రభుత్వం బరితెగించిందంటూ జనం అగ్గిమీద గుగ్గిలమౌతున్నారు.



- జిల్లాపై నెలకు రూ.24 కోట్ల భారం
- అయినా తప్పని ఉక్కపోత
- ప్రభుత్వం బరితెగించిందంటున్న ప్రజానీకం

ప్రజాశక్తి - విజయనగరం ప్రతినిధి

విజయనగరం ఉమ్మడి జిల్లాలో 8,11,017 విద్యుత్ కనెక్షన్లు ఉన్నాయి. ఇందులో గృహాలకు 6,71,921, వాణిజ్య 68,939, ప్రభుత్వ కార్యాలయాలకు 15,321, వ్యవసాయ పంపుసెట్లకు 52,082 ఉన్నాయి. వీటన్నింటికీ ఏపిఇపిడిసిఎల్ ద్వారా విద్యుత్ సరఫరా అవుతోంది. వినియోగదారులంతా ఎప్పటి బిల్లులు అప్పుడే చెల్లిస్తున్నారు. ఒక వేళ గడువు తేదీలోపు చెల్లించకపోతే ఫీజులు పీకేసి మరీ విద్యుత్ సరఫరాను నిలిపివేస్తున్నారు. అయినప్పటికీ లెక్కలు వేశాక వినియోగదారులు చెల్లించిన డబ్బులు విద్యుత్తు ఉత్పత్తి, పంపిణీ తదితర ఖర్చులకు సరిపోలేదంటూ సర్ ఛార్జీల పేరిట అదనంగా వసూలు చేస్తున్నారు. మరే సంస్థలోనూ లేని విధంగా విద్యుత్ పంపిణీ సంస్థల్లోనే ఇటువంటి విధానం అమలవుతుంది. ఈనేపథ్యంలో నాణ్యమైన కరెంటు నిరంతరం సరఫరా చేయాల్సిన ప్రభుత్వం వేలాపాలా లేకుండా విద్యుత్ కోతలకు పాల్పడుతోంది. పట్టణాలు, గ్రామాలు, రాత్రి పగలు అన్న తేడా లేదు. అన్ని చోట్లా సమయంతో సంబంధం లేకుండా రోజుకు 4 నుంచి 5గంటల పాటు విద్యుత్ కట్ చేయడంతో ప్రజలు తీవ్ర అవస్థలు పడుతున్నారు. అసలే ఎండలు వేసవికాలాన్ని తలపిస్తున్నాయి. ఉక్కపోత, వేడి చాలా ఎక్కువగా ఉంది. ఈనేపథ్యంలో రాత్రివేళల్లో కట్ చేయడం వల్ల నిద్రాభంగం ఏర్పడుతోంది. ముఖ్యంగా పిల్లలు, వృద్ధులు తీవ్ర అస్వస్థత పడుతున్నారు. పగటిపూట విద్యుత్ సరఫరా నిలిపివేయడంతో వ్యవసాయ పంప్ సెట్ల నుంచి సాగునీరు అందని పరిస్థితి. అసలే వర్షాభావం వెంటాడుతోంది. ఈనేపథ్యంలో అక్కడక్కడ విద్యుత్ బోర్ల సాయంతో ఉబాలు పడుతున్నారు. విద్యుత్ అంతరాయం వల్ల నాట్లకు ఆటంకం కలుగుతోంది. కార్యాలయాల్లో గంటల తరబడి విద్యుత్ లేకపోవడంతో కంప్యూటర్లతో పనిచేయడం సాధ్యపడడం లేదు. ఇక పట్టణ ప్రాంతాల్లో మిగిలిన సమయాల్లో ముఖ్యంగా హోటళ్లు, ఇళ్లల్లో పిండిరుబ్బు వేసేందుకు ఆటకంగా మారింది. సమయానికి విద్యుత్ లేకపోవడంతో ఇళ్లలో నీరు లేక, సకాలంలో ఆఫీసులకు, ఇతర పని ప్రదేశాలకు బయలుదేరలేని పరిస్థితి దాపురిస్తోంది. నెట్, జిరాక్స్ వంటి దుకాణాలు, షాపులు నడుపుతున్నవారు ఉపాధి కోల్పోవాల్సిన దుస్థితి దాపురిస్తోంది.

సర్దుబాటు ఛార్జీలు ఇలా

విద్యుత్తు భారాలు మోపేందుకు మాత్రం ఢోకా లేదు. 2014 నుంచి 19వరకు వినియోగించుకున్న విద్యుత్‌కు చెల్లించిన బిల్లులు సరిపోలేదంటూ రాష్ట్ర వ్యాప్తంగా రూ.2,900 కోట్లమేర సర్దుబాటు భారం మోపింది. జనం నుంచి మూడేళ్లపాటు వసూలు చేయడానికి విద్యుత్ ఛార్జీల నియంత్రణ మండలి ద్వారా విద్యుత్ పంపిణీ సంస్థలు ఆమోదం పొందాయి. ఇప్పటికే యూనిట్‌కు 20పైసలు చొప్పున 11నెలల పాటు వినియోగదారులు చెల్లించారు. మరో 25నెలలపాటు ఇంకా చెల్లించాల్సివుంది. ఇది చాలదన్నట్టుగా 2021 -22 ఆర్థిక సంవత్సరంలో వినియోగించిన విద్యుత్ బిల్లులకు చెల్లించిన మొత్తం సరిపోలేదంటూ మరోసారి 20పైసలు చొప్పున సర్దుబాటు ఛార్జీలు మోపుతున్నారు. పాత, కొత్త సర్దుబాటు ఛార్జీలు 40పైసలు మోయడమే వినియోగదారులకు అత్యంత కష్టతరంగా మారింది. ఇటువంటి పరిస్థితుల్లో విద్యుత్ భారాన్ని తగ్గించాల్సిన కేంద్ర ప్రభుత్వం ఇప్పుడు పడుతున్న భారాలకు ఎప్పటి వరకో ఎందుకు ఆగాలి అంటూ మరుచటి నెలలోనే సర్దుబాటు ఛార్జీలు వసూలు చేయాలని ఆదేశించింది. మోడీ ఆదేశాలే తడువుగా జగన్ సర్కారు ఏప్రిల్ నెలలో చెల్లించిన డబ్బులు సరిపోలేదని మరో 40పైసలు వసూళ్లకు సిద్ధపడింది. ఈ లెక్కన కేవలం సర్దుబాటు ఛార్జీ రూపంలోనే 80పైసలు భారం పడుతోంది. జిల్లాలో రోజుకు సుమారు కోటి యూనిట్ల వినియోగం ఉందని అధికారులు చెబుతున్నారు. ఈ నేపథ్యంలో జిల్లా వాసులపై నెలకు రూ.80లక్షల వరకు భారం పడుతోంది. ఏడాదికి రూ.24కోట్ల పైమాటే భారం. దీనికితోడు నెలవారీ వినియోగపు బిల్లు, ఫిక్స్‌డ్ ఛార్జీ, కస్టమర్ ఛార్జీ, ట్రూ అప్ ఛార్జీ తదితరాల రూపంలో అధిక మొత్తంలో బిల్లులు విధించారు. 20 నుంచి 30 యూనిట్లు వినియోగించిన సామాన్య కుటుంబాలకు వేల రూపాయల బిల్లులు వస్తున్నాయి. దీంతో, గత నెలతో పోలిస్తే రెట్టింపు స్థాయిలో బిల్లులు వచ్చాయంటూ వినియోగదారులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. అసలు ఛార్జీకన్నా ఇలా కొసరుగా విధిస్తున్న ఛార్జీలే అధికంగా ఉన్నాయి. దీంతో, తమకు అర్థం కాకుండా కొత్తకొత్త రూపాల్లో ఛార్జీలు పెంచి తమను మోసం చేస్తున్నారని జనం ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

వేళాపాలా లేని విద్యుత్ కోతలతో అవస్థలు



నేను టైలర్ వృత్తి చేసుకుంటూ కుటుంబాన్ని నెట్టుకొస్తున్నాను. ఇటీవల వేళా పాలా లేని విద్యుత్ కోతలతో బట్టలు సక్రమంగా కుట్టలేకపోతున్నాను. దీనివల్ల ఆర్థికంగా ఇబ్బందులు ఎదుర్కొంటూ పిల్లలను చదివించడానికి, కుటుంబాన్ని నెట్టుకు రావడానికి కష్టంగా ఉంది. విద్యుత్ శాఖ అధికారులకు ఫోన్ చేస్తే ఎప్పుడు వస్తుందో తెలియదని సమాచారం సక్రమంగా ఇవ్వడం లేదు. దీంతో కరెంటు కోసం ఎదురు చూడాల్సి వస్తుంది.

గొర్లి చిన్నారావు, టైలర్, కురుపాం.

ఉత్తమ గురువులకు గుర్తింపు

ముగ్గురు ఉపాధ్యాయులకు రాష్ట్ర స్థాయి అవార్డులు

ప్రజాశక్తి- సాలూరు, గుమ్మలక్ష్మీపురం, వీరఘటం

విద్యారంగంలో ఉత్తమ సేవలు అందించిన జిల్లాలోని ముగ్గురు ఉపాధ్యాయులు రాష్ట్రస్థాయి ఉత్తమ ఉపాధ్యాయ అవార్డులకు ఎంపికయ్యారు. వారిలో సాలూరు పట్టణంలోని బంగారమ్మపేట మున్సిపల్ యుపి పాఠశాల ప్రధానోపాధ్యాయులు డాక్టర్ రంభ రజనీకాంత్, జియ్యమ్మవలస మండలం రావాడ రామభద్రపురం గిరిజన సంక్షేమ బాలుర ఉన్నత పాఠశాల హెచ్‌ఎం నరిసిపిల్లి తిరుపతి, వీరఘట్టం మండలం చిట్టిపూడివలస మండల పరిషత్ ప్రాథమిక పాఠశాల ఉపాధ్యాయుడు సాకేటి రాంబాబు ఉన్నారు.

రెండుసార్లు రాష్ట్ర స్థాయి ఉత్తమ ఉపాధ్యాయుడిగా రజనీకాంత్



సాలూరు : పట్టణంలోని బంగారమ్మపేట మున్సిపల్ యుపి పాఠశాల హెచ్‌ఎం డాక్టర్ రంభ రజనీకాంత్ రాష్ట్ర స్థాయి ఉత్తమ ఉపాధ్యాయ అవార్డు ఎంపికయ్యారు. ఆయనకి రాష్ట్ర స్థాయి ఉత్తమ ఉపాధ్యాయ అవార్డు రావడం ఇది రెండో సారి. 2018లో జాతీయుపాధ్యాయ సంక్షేమ సంస్థ, రాష్ట్ర విద్యాశాఖ ప్రకటించిన రాష్ట్రస్థాయి ఉత్తమ ఉపాధ్యాయ అవార్డుల గ్రహీతల్లో రజనీకాంత్‌లో ఒకరు. 2021లో రాష్ట్రస్థాయి ఉత్తమ ఉపాధ్యాయ అవార్డుకు ఎంపికయ్యారు. కానీ కరోనా కారణంలో అందుకోలేదు. రజనీకాంత్ రామానుజన్ మేథ్స్ క్లబ్‌ను 2001లో ఏర్పాటు చేసి విద్యార్థుల్లో గణితం పట్ల అవగాహన కల్పిస్తున్నారు. ఏటా రామానుజన్ జన్మదినం సందర్భంగా విద్యార్థులకు గణితంలో ప్రతిభా పరీక్ష నిర్వహిస్తున్నారు. ప్రభుత్వ పాఠశాల హెచ్‌ఎంగా పాఠశాలలో విద్యార్థుల హాజరు పెంచేందుకు కృషి చేస్తున్నారు. పేద విద్యార్థుల కోసం సొంత ఖర్చులతో ఆటో నడిపి రవాణా సౌకర్యం కల్పిస్తున్నారు. ఈ ప్రాంతానికి చెందిన రజనీకాంత్‌కు రెండు సార్లు రాష్ట్ర స్థాయి ఉత్తమ ఉపాధ్యాయ అవార్డు రావడం పట్ల పలువురు ఉపాధ్యాయులు, లయన్స్ డైమండ్స్ క్లబ్ సభ్యులు హర్షం వ్యక్తంచేశారు.

ఉత్తమ ఉపాధ్యాయుడిగా తిరుపతి



గుమ్మలక్ష్మీపురం : జియమ్మవలస మండలం రావాడ రామభద్రపురం గిరిజన సంక్షేమ బాలుర ఆశ్రమ ఉన్నత పాఠశాలలో ప్రధానోపాధ్యాయులుగా విధులు నిర్వహిస్తున్న నరిసిపిల్లి తిరుపతి రాష్ట్రస్థాయిలో ఉత్తమ ఉపాధ్యాయ అవార్డుకు ఎంపికయ్యారు. 2018- 19 సంవత్సరంలో మొదట సారిగా జిల్లా ఉత్తమ ఉపాధ్యాయ అవార్డులు అందుకున్నారు. గిరిజన సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో ప్రారంభించిన ప్రతిభా స్కూల్ స్కూల్ ఆఫ్ ఎక్సలెన్సీలో పనిచేసి చుక్క రామయ్య ప్రశంసలతో అనేక సైన్స్ ఫెయిర్, జాతీయ సైన్స్ కాంగ్రెస్‌లో పాల్గొని తన విద్యార్థులతో అనేక బహుమతులు పొందారు. 2006 నుంచి 2003 వరకు పార్వతీపురం మండలం డోకిశిల గిరిజన సంక్షేమ ఆశ్రమ ఉన్నత పాఠశాలలో పనిచేసి సైన్స్ పట్ల కుతూహలంతో ప్రత్యేకమైన సైన్స్ ల్యాబ్ ఏర్పాటు చేసి గిరిజన విద్యార్థులు మూఢనమ్మకాలకు గురికాకుండా సైన్స్ పట్ల శాస్త్రీయ దక్పథం పొందేలా కృషి చేశారు. అనేకమంది విద్యార్థులను, ముఖ్యంగా గిరిజన విద్యార్థుల్లో శాస్త్రీయ దక్పథం పెంచి వారిలో చదువు పట్ల ఇష్టం పెరగడానికి అనేక ప్రాజెక్టులు రూపొందించేందుకు గానూ రాష్ట్రస్థాయిలో ఉత్తమ అవార్డు రావడం పట్ల సంతోషం వ్యక్తం చేస్తున్నట్లు ఆయన చెప్పారు. పదో తరగతిలో శత శాతం ఉత్తీర్ణత వచ్చేందుకు పలువురు అభినందించినట్లు ఆయన చెప్పారు.

ఉత్తమ ఉపాధ్యాయుడిగా తిరుపతి



వీరఘట్టం : మండలంలోని చిట్టిపూడివలస గ్రామ, మండల పరిషత్ ప్రాథమిక పాఠశాలలో ఎస్‌జిటి ఉపాధ్యాయులుగా విధులు నిర్వహిస్తున్న షాకేటి రాంబాబు రాష్ట్ర స్థాయి ఉత్తమ ఉపాధ్యాయునిగా ఎంపికయ్యారు. 2002లో ఉపాధ్యాయుడిగా విధుల్లో చేరిన రాంబాబు మండల, జిల్లాస్థాయి ఉత్తమ ఉపాధ్యాయులకు ఎంపిక అయ్యారు. విద్యా బోధనతోపాటు సామాజిక కార్యక్రమాల్లో చురుగ్గా పాల్గొనడంతో అధికారులు గుర్తించి రాష్ట్రస్థాయి ఉత్తమ ఉపాధ్యాయునిగా ఎంపిక చేశారు. తోటి ఉపాధ్యాయులు సెలవుల దొరికితే కుటుంబ సమేతంగా సంతోషంగా కాలం గడుపుతారు. కానీ రాంబాబు మాస్టర్ మాత్రం ఆదివారమైనా పాఠశాలకు వెళ్లి విద్యార్థులకు బోధన చేస్తూ ఉంటారు. అను నిత్యం బోధన చేయడంతో విద్యార్థుల తల్లిదండ్రులు తమ పిల్లల భవిష్యత్తు బాగుంటుందని రాంబాబు మాస్టర్ వద్దకు చదువుల కోసం పంపిస్తూ ఉన్నారు. ఈయన దగ్గర చదివిన సుమారు 200 మంది విద్యార్థులు జవహర్ నవోదయ ఏపీ రెసిడెన్షియల్ పాఠశాలకు ఎంపిక కావ్వడంతో ఆ గ్రామంలో మాస్టర్ పట్ల మంచి ఆదరణ పెరుగుతుంది. ఈ మేరకు శుక్రవారం స్థానిక ఎంఇఒ కార్యాలయంలో ఎంఇఒలు డి.గౌరునాయుడు, ఆర్.ఆనందరావు రాంబాబును అభినందించారు. వీరితో పాటు పాఠశాల సిబ్బంది కూడా అభినందనలు తెలిపారు.

3437 మంది కౌలురైతులకు లబ్ధి

ప్రజాశక్తి - పార్వతీపురం

జిల్లాలో 3437 మంది కౌలుదారులకు వైఎస్ఆర్ రైతు భరోసా ఐదో ఏడాది మొదటి విడత ఆర్థిక సహాయం జమైంది. ముఖ్య మంత్రి వర్చువల్ విధానంలో శుక్ర వారం తాడేపల్లి క్యాంపు కార్యాలయం నుండి కౌలు రైతులకు రైతు భరోసా ఆర్థిక సహాయాన్ని విడుదల చేశారు. ఈ వీడియో కాన్ఫరెన్స్‌లో జిల్లా వ్యవసాయ సలహా మండలి అధ్యక్షులు వాకాడ నాగేశ్వర రావు, జిల్లా కలెక్టర్ నిశాంత్ కుమార్ పాల్గొన్నారు. అనంతరం కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలో 3437 మంది కౌలు రైతులకు రూ.2.57 కోట్లు జమ అవుతుందన్నారు. ఎకరా దాటి సాగుచేస్తున్న కౌలు రైతులు ఇందుకు అర్హులని పేర్కొన్నారు. కార్యక్రమంలో జిల్లా వ్యవసాయ అధికారి కె. రాబర్ట్ పాల్, వ్యవసాయ శాఖ సహాయ సంచాలకులు వెంకటేష్, వ్యవసాయ అధికారి అశోక్, కౌలు రైతులు పాల్గొన్నారు.

ఇస్రోకు 'శ్రీభారతి' విద్యార్థుల ఆల్ ది బెస్ట్

ప్రజాశక్తి - బలిజిపేట



ఆల్‌ది బెస్ట్ నమూనాలో కూర్చున్న శ్రీభారతి స్కూలు విద్యార్థులు

ఇస్రో శనివారం భారత చేపట్టనున్న ఆదిత్య-ఎల్1 ప్రయోగానికి మండలంలోని శ్రీ భారతి ఇంగ్లీష్ మీడియం స్కూల్ విద్యార్థులు శుక్రవారం ఆల్ ద బెస్ట్ చెప్పే నమూనా ప్రదర్శించారు. ఈ సందర్భంగా ఆ పాఠశాల ప్రధానోపాధ్యాయులు బి.జగన్ మాట్లాడుతూ 2008లో చంద్రయాన్-1 నుంచి 15ఏళ్ల కఠోర దీక్ష చేసి, చంద్రయాన్-3 ద్వారా ఘనత సాధించి దేశానికి మంచి పేరు వచ్చిందన్నారు. అయితే అదే క్రమంలో ఆదిత్య ఎల్ -1 విజయవంతం కావాలని, ఈ విధంగా నమూనా వేయడం జరిగిందని అన్నారు. కార్యక్రమంలో పాఠశాల సిబ్బంది స్వప్న, వెంకట్, లక్ష్మణ, శ్రీను, సిబ్బంది పాల్గొన్నారు.

పులి సంచారంపై అప్రమత్తం

ప్రజాశక్తి - సీతంపేట

మండలంలోని గెద్దగూడ సమీపాన గురువారం సుక్కయ్య మేకలు కాస్తుండగా రామానగరం కొండపై నుంచి పులి పది మీటర్ల దూరంలో ఎదురెవడంతో భయభ్రాంతులకు గురై గ్రామానికి వచ్చి తోటి గిరిజనులకు, అటవీ శాఖ సిబ్బందికి సమాచారం ఇచ్చాడు. దీంతో అటవీ శాఖ సిబ్బంది గెద్దగూడ, కోసంగి, దారపాడు తదితర గ్రామాల్లో శుక్రవారం అప్రమత్తంగా ఉండాలని డిఆర్ఒ రవికుమార్, ఫారెస్ట్ బీట్ అధికారి దాలినాయుడు, వెంకటమ్మ, ఆదినారాయణ అవగాహన కల్పించారు. పులి సంచారంపై ఐటిడిఎ అధికారులు చర్యలు తీసుకోవాలని ఆదివాసీ గిరిజన సంఘం మండల కార్యదర్శి ఎ.గంగాధర్ కోరారు. గత 18 ఏళ్లుగా ఏనుగులతో ప్రాణ, ఆస్తి నష్టం జరుగుతుందని గిరిజనులు ఆందోళన వ్యక్తం చేశారు. ఇప్పుడు పులి సంచారం నిరంతరం అటవీ శాఖ, ఐటిడిఎ పర్యవేక్షణ చేసి గిరిజనులను కాపాడాలని కోరారు. పులి సంచారంతో గిరిజనులు భయభ్రాంతులకు గురవుతున్నారని అన్నారు.

ప్రజా వ్యతిరేక విధానాలపై పోరాడాలి

సచివాలయాల వద్ద సిపిఎం నిరసనలు



కురుపాంలో వినతిని అందజేస్తున్న సిపిఎం జిల్లా కార్యదర్శి రెడ్డి వేణు

ప్రజాశక్తి - కురుపాం

కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అనుసరిస్తున్న ప్రజా వ్యతిరేక విధానాలపై పోరాటాలకు ప్రజలు సిద్ధంగా ఉండాలని సిపిఎం జిల్లా కార్యదర్శి రెడ్డి వేణు పిలుపునిచ్చారు. మండలంలోని గుజ్జువాయి సచివాలయం వద్ద స్థానిక సమస్యలపై శుక్రవారం ధర్నా నిర్వహించి అనంతరం సచివాలయ కార్యదర్శికి వినతి పత్రం అందించారు. గుజ్జువాయి పంచాయితీ పరిధిలో గల డి.బారామని, బారామని, కాలనీగూడల్లో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అనుసరిస్తున్న ప్రజా వ్యతిరేక విధానాలపై సంతకాలు సేకరించి గుజ్జువాయి సచివాలయం వద్ద నిరసన తెలిపారు. కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ ప్రజలపై భారాలు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు మోపుతున్నాయని, అడవులను అదానీకి ధారదత్తం చేయడానికి కేంద్రం చూస్తుంటే పూర్తిగా గిరిజన హక్కులను కాలరాయడానికి చూస్తుందని అన్నారు. కావున కేంద్ర ప్రభుత్వ ప్రజా వ్యతిరేక విధానాలకు నిరసనగా ఈనెల 4న మండలం తహశీల్దార్ కార్యాలయం వద్ద నిర్వహించబోయే ధర్నాకు పెద్ద ఎత్తున ప్రజలు పాల్గొని జయప్రదం చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో సిపిఎం నాయకులు వి.వాసు, వైకంఠ, అంగధ, సుబ్బారావు, పార్వతి, పి.శయమే తదితరులు పాల్గొన్నారు.

పాలకొండ: సిపిఎం సమరభేరి కార్యక్రమంలో భాగంగా మండలంలోని సింగన్న వలస, వెలగవాడ, పాలకొండ పట్టణంలోని గారమ్మ కాలనీలో, 3,5 వార్డులకు సంబంధించి ఎన్ కె రాజపురం సచివాలయం వద్ద నిరసన తెలిపి, వినతులు అందజేశారు. కార్యక్రమంలో సిపిఎం మండల కన్వీనర్ డి.రమణారావు, మండల కమిటీ సభ్యులు డి.దుర్గారావు, ఎ.భానుచందర్, వై.చంప, ఎస్.జోషి, ఎస్.చిన్నారావు, ఎస్.మల్లేష్, ఎస్.సింహాచలం, ఎస్.సాంబయ్య, దూసి దుర్గారావు, డి.జగన్నాథం, జి.లక్ష్మణరావు, ఎం.దుర్గారావు, కాద రాము, పడాల వేణు, చింతల సంజీవ్, అర్థముడి లక్ష్మణరావు ఎ.లక్ష్మణరావు ఎం రమేష్ జి హేమ్ సుందర్ రావ్ పట్టణ పౌరులు పి రమణ తదితరులు నిరసన తెలిపారు.

సాలూరు: ప్రజాసమస్యలను పరిష్కరించాలని కోరుతూ పట్టణంలోని సచివాలయాలలో సిపిఎం ఆధ్వర్యాన వినతులను అందజేశారు. సిపిఎం జిల్లా కమిటీ సభ్యులు ఎన్నె నాయుడు ఆధ్వర్యాన పట్టణం లోని 6,7,8,9,12 సచివాలయాలలో పార్టీ నాయకులు వినతి పత్రాలను సమర్పించారు. 6,7వార్డు సచివాలయంలో సిపిఎం పట్టణ నాయకులు టి.వెంకటరావు, టి.రాముడు ఆధ్వర్యాన వేదసమాజం వద్ద ఉన్న 8,9 వార్డుల సచివాలయం లో సిపిఎం నాయకులు కేరంగి వెంకట్రావు, జె.శేఖర్, బంగారమ్మపేట సచివాలయంలో సిపిఎం నాయకులు మంగమ్మ, నితిన్, రమేష్ ఆధ్వర్యాన వినతులు అందజేశారు.



బలిజిపేటలో బైక్ ర్యాలీ చేస్తున్న సిపిఎం నాయకులు, కార్యకర్తలు

సమస్యల పరిష్కారం కోరుతూ సిపిఎం బైక్ ర్యాలీ

ప్రజాశక్తి - బలిజిపేట

కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు పెంచిన ధరలు తగ్గించాలని, నిరుద్యోగులకు ఉద్యోగాలు ఇవ్వాలని, పెంచిన కరెంటు చార్జీలు తగ్గించాలని సిపిఎం రాష్ట్రవ్యాప్తంగా సమరభేరి కార్యక్రమంలో సందర్భంగా శుక్ర వారం మండలంలోని బైక్ ర్యాలీ జరిగింది. బలిజిపేట, నారాయణపురం, పెద్దింపేట, వెంగాపురం, తుమరాడ, పలగర, మిర్తివలస, బర్లి, అంపావల్లి గ్రామాల్లో నిరసన కార్యక్రమలు చేపట్టారు. ఈ సందర్భంగా సిపిఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు యమ్మల మన్మథ రావు, సీనియర్ నాయకులు గేదెల సత్యనారాయణ మాట్లాడుతూ ధరలు తగ్గించాలని, ఉద్యోగాలు ఇవ్వాలని, విద్యుత్ ఛార్జీలు తగ్గించాలని, ఉపాధిహామీ వేతనం రూ.600 కూలి, 200 రోజులు పని దినాలు కల్పించేంత వరకూ పోరాడాలని పిలుపునిచ్చారు. కార్యక్రమాల్లో చిప్పాడ సుబ్బయ్య, నులకమజ్జి త్రినాథ, బి.భానుమూర్తి, ఆవు, సాంబమూర్తి, గౌరీశ్వరరావు, ఎ.కోటి, కృష్ణమురళి, సంతు, వెన్నెల వేణు పాల్గొన్నారు.

గుమ్మలక్ష్మీపురం : మండలంలోని గుమ్మలక్ష్మీపురం, ఎల్విన్‌పేట, ఇరిడి, కుక్కిడి, డుమ్మంగి, తాడికొండ, లుంబేసు, దుడ్డు ఖల్లు సచివాలయాలు వద్ద సిపిఎం ఆధ్వర్యంలో నిరసన చేపట్టారు. అనంతరం సిపిఎం మండల కార్యదర్శి కోలక అవినాష్ ఆధ్వర్యాన జిల్లా కమిటీ సభ్యులు మండంగి రమణ, సిఐటియు మండల కార్యదర్శి కె గౌరీశ్వరరావు, మండల నాయకులు ఎం.సన్యాసిరావు, సుబ్బారావు, పాండురంగారావు తదితరులు వినతులు అందజేశారు.

సీతానగరం: మండలంలోని బూర్జ, లక్ష్మిపురం, నిడగల్లు, రంగమ్మపేట, ఆర్.వెంకమ్మపేట సచివాలయాల వద్ద సిపిఎం మండల కార్యదర్శి రెడ్డి ఈశ్వరరావు, జి.వెంకటరమణ ఆధ్వర్యాన నిరసన కార్యక్రమాలు జరిగాయి. అనంతరం ప్రజల వద్ద నుంచి చేసిన సంతకాలను ఆయా గ్రామ సచివాలయ అధికారులకు అందజేశారు. ఈనెల 4న తహశీల్దార్ కార్యాలయాల వద్ద జరగనున్న నిరసన కార్యక్రమాలను జయప్రదం చేయాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో సిపిఎం నాయకులు డి.నారా యణరావు, ఎం.సింహాచలం, కె.నానిబాబు, రమణమూర్తి, రెడ్డి సత్యనారాయణ, యాళ్ల ఈశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.



సీతానగరం : బూర్జ సచివాలయం వద్ద నిరసన తెలుపుతున్న ప్రజలు

గుమ్మలక్ష్మీపురం : జియమ్మవలస మండలం అలమండ, జియ్యమ్మవలస సచివాలయాల ఎదుట నిరసన కార్యక్రమం చేపట్టారు. సిపిఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు కొల్లి గంగనాయుడు ఆధ్వర్యాన జరిగిన ఈ కార్యక్రమంలో పలువురు నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

పాచిపెంట : కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వ విధానాలను నిరసిస్తూ సిపిఎం ఆధ్వర్యంలో పనుకువలస సచివాలయం వద్ద సిపిఎం నాయకులు సుర్రు రామారావు, సిహెచ్.సింహాచలం. సిపిఎం జిల్లా కమిటీ సభ్యులు కోరాడ ఈశ్వరరావు ఆధ్వర్యంలో సచివాలయం కార్యదర్శికి వినతిని అందజేశారు. కార్యక్రమంలో మహిళలు కార్యకర్తలు పాల్గొన్నారు.

సీతంపేట: మండలంలోని దారపాడు గ్రామ సచివాలయం వద్ద ప్రభుత్వం విధానాలపై సిపిఎం ఆధ్వర్యంలో ఆందోళన కార్యక్రమాలు నిర్వహించారు. సంతకాలు చేసి వినతిపత్రం సచివాలయం కార్యదర్శికి అందజేశారు. ప్రజా సమస్యలపై తెలియజేశారు. కార్యక్రమంలో సిపిఎం నాయకులు ఎం.తిరుపతిరావు, జె.శ్రీరాములు, పి.సాంబయ్య, కె.దుర్గారావు, సర్పంచ్ జె. సుందరమ్మ తదితరులు పాల్గొన్నారు.

సాలూరురూరల్ : సిపిఎం మండల కమిటీ ఆధ్వర్యంలో మండలంలోని మరిపల్లి, అన్నంరాజు వలస, నార్లవలస, జీగిరాం గ్రామ సచివాలయాల్లో నిరసన కార్యక్రమాలు చేపట్టారు. కార్యక్రమంలో సిపిఎం మండల కార్యదర్శి మర్రి శ్రీనివాసరావు, మండల కమిటీ సభ్యులు వంతల సుందర్రావు, కోనేటి చినబాబు, వ్యవసాయ కార్మిక సంఘం మండల అధ్యక్షులు సిద్ధ సాయిబాబా, కె.లక్ష్మి, ఆర్.లక్ష్మి, సిహెచ్ సుశీల, కె.పొన్నాలు, భాస్కరరావు, ఆదినారాయణ, తాడంగి ఘాసి, గబడారి శ్రీను తదితరులు పాల్గొన్నారు.

గరుగుబిల్లి: మండలంలోని గొట్టివలస, రావుపల్లి, శివం సచివాలయంలో సిపిఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు యమ్మల మన్మథరావు ఆధ్వర్యాన వినతి పత్రాలను అందజేశారు. కార్యక్రమంలో కార్యక్రమంలో గేదెల రామ్మూర్తి నాయుడు, ప్రకాశం, సాంబయ్య, శివ, సింహాచలం, శ్రీను పాల్గొన్నారు.

కొమరాడ : మండలంలోనికొమరాడ, పూడేసు, చోలపదం, ఉలిపిరి, కుంతేసు, గుమడ సచివాలయాల వద్ద సిపిఎం ఆధ్వర్యాన నిరసన తెలిపి వినతి పత్రాలు అందజేశారు. కార్యక్రమంలో సిపిఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు వి.ఇందిర, జిల్లా కమిటీ సభ్యులు కొల్లి సాంబమూర్తి, నాయకులు ఉపేంద్ర, బిడ్డిక దాలయ్య, శివున్నాయుడు తదితరులు పాల్గొన్నారు. అలాగే ఈనెల 4న తహశీల్దార్ కార్యాలయం వద్ద జరుగు ధర్నాను జయప్రదం చేయాలని పిలుపునిచ్చారు.



సీతంపేటలో సచివాలయం వద్ద నిరసన తెలుపుతున్న నాయకులు

పార్వతీపురంటౌన్ : మున్సిపల్ పరిధిలో గల 1,15 సచివాలయాల వద్ద సిపిఎం నిరసన కార్యక్రమాన్ని చేపట్టింది. అనంతరం సచివాలయాల కార్యదర్శులకు వినతి పత్రాలు అందజేశారు. కార్యక్రమంలో సిపిఎం పట్టణ కార్యదర్శి గొర్లి వెంకటరమణ, పట్టణ కమిటీ సభ్యులు రెడ్డి శ్రీదేవి, పాకల సన్యాసిరావు, బంకురు సూరిబాబు, సంచాన ఉమా, రాజశేఖర్, పార్టీ సభ్యులు గెద్ద తులసి, మాన్యం గౌరమ్మ తదితరులు పాల్గొన్నారు. అనంతరం వెంకటరమణ మాట్లాడుతూ ఈనెల 4న తహశీల్దారు కార్యాలయం వద్ద తలపెట్టిన నిరసనను జయప్రదం చేయాలని పిలుపునిచ్చారు.

పార్వతీపురం రూరల్: మండలంలోని సంఘం వలస సచివాలయం ఎదుట జిల్లా కమిటీ సభ్యులు, రావికోన సర్పంచ్ కె రామస్వామి ఆధ్వర్యంలో నిరసన చేపట్టారు. అనంతరం సచివాలయ సిబ్బందికి వినతి అందించారు. కార్యక్రమంలో గిరిజన సంఘం నాయకులు కె.శంకర్రావు, సింహాచలం, రైతు సంఘం నాయకులు సత్యనారాయణ, పలువురు రైతులు పాల్గొన్నారు.



సాలూరులో వినతిని అందజేస్తున్న సిపిఎం నాయకులు



విద్యార్థినులతో కలిసి నృత్యం చేస్తున్న ట్రైనీ ఐఎఎస్‌లు

ఆశ్రమ పాఠశాలను సందర్శించిన ట్రైనీ ఐఎఎస్‌లు

ప్రజాశక్తి - సీతంపేట

స్థానిక గిరిజన బాలికల ఆశ్రమ ఉన్నత పాఠశాలను ట్రైనీ ఐఎఎస్‌ల బృందం శుక్రవారం సందర్శించింది. విద్యార్థులతో కాసేపు ముచ్చటించారు. విద్య ప్రమాణాలు, ఆరోగ్యం గురించి అడిగి తెలుసుకున్నారు. విద్యార్థినిలు నిర్వహించిన సాంస్కృతిక కార్యక్రమాలు తిలకించారు. ట్రైనింగ్ బృందం తుషాన్ కుమార్, వరుణ్ గౌడ్, సోనమ్, డిప్యూటీ డిఇఒ ఎ.లిల్లీరాణి ఎటిడబ్ల్యుఒ, మంగవేణి తదితరులు పాల్గొన్నారు.



గెడ్డలుప్పిలో జగనన్న ఇళ్ల కాలనీని పరిశీలిస్తున్న జమ్మాన ప్రసన్నకుమార్

గెడ్డలుప్పిలో జమ్మాన పర్యటన

ప్రజాశక్తి - సీతానగరం

మండలంలోని గెడ్డలుప్పిలో శుక్రవారం డిసిసిబి చైర్మన్ జమ్మాన ప్రసన్నకుమార్ పర్యటించారు. ఈ సందర్భంగా ఆయన జగనన్న కాలనీని పరిశీలించారు. ప్రభుత్వం అర్హులైన ప్రతి పేదవానికి జగనన్న కాలనీ ఇల్లు నిర్మించి ఇస్తుందన్నారు. ప్రతి పేదవానికి సంక్షేమ పథకాలు అందేలా కృషి చేస్తున్న జగన్ ప్రభుత్వాన్ని మళ్లీ గెలిపించుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో వైసిపి నాయకులు జి.వెంకటనాయుడు, రామనాయుడు, తౌడు తదితరులు పాల్గొన్నారు.



లుంబేసులో పాఠశాల పనులను పరిశీలిస్తున్న ఎంఇఒ చంద్రశేఖర్

నాడు-నేడు పనులు వేగవంతం

ప్రజాశక్తి - గుమ్మలక్ష్మీపురం

మండలంలో చేపడుతున్న నాడు-నేడు భవన నిర్మాణ పనులను వేగవంతం చేయాలని ఎంఇఒ -1 చంద్రశేఖర్ తెలిపారు. శుక్రవారం ఆయన గౌడుగూడ, లుంబేసు, ఎగువ తాడికొండ, తోలుకర్జ, ఇరిడి, తాడికొండ గ్రామాల్లో గల ప్రాథమిక పాఠశాలలను సందర్శించారు. ఈ సందర్భంగా ఆయా పాఠశాలల్లో నిర్మాణం చేపడుతున్న నాడు-నేడు ఆదనపు భవనాల నిర్మాణ పనులను పరిశీలించి ఆయా పనులను వేగవంతం చేయాలని ఉపాధ్యాయులను ఆదేశించారు. ఆయా పనుల్లో నాణ్యతా ప్రమాణాలను పాటించి సక్రమంగా ఉండేలా ప్రధానోపాధ్యాయులు పరిశీలించాలన్నారు. అనంతరం ఆయా పాఠశాలల్లో ఉపాధ్యాయులకు సంబంధించిన పాఠ్య ప్రణాళికలను, డైరీలను, వర్క్ బుక్‌లను పరిశీలించారు. ఈ సందర్భంగా ఉపాధ్యాయులకు పలు సూచనలు చేశారు. ఆయన వెంట తాడకొండ స్కూల్ కాంప్లెక్స్ ప్రధానోపాధ్యాయులు రవికుమార్, ఉపాధ్యాయులు, సిఆర్పి లు ఉన్నారు.



విద్యార్థులకు పతకాలను అందజేస్తున్న ఎంఇఒ సింహాచలం

విజేతలకు బహుమతుల ప్రదానం

ప్రజాశక్తి - బలిజిపేట

ప్రత్యేక అవసరాలు గల పిల్లలకు ఇటీవల పార్వతీపురంలో నిర్వహించిన ఆటల పోటీల్లో మండలానికి చెందిన విద్యార్థులకు బహుమతులను శుక్రవారం స్థానిక ఎమ్మార్సీ వద్ద ఎంఇఒ సామల సింహాచలం అందజేశారు. బహుమతులు అందుకున్న వారిలో చింతాడ మనోజ్ (బలిజిపేట హై స్కూల్), భోగి సౌమ్య బంగారు పతకాలను, ఉత్తరావల్లి కార్తీక్, గొండ గణేష్, ఎస్.శివ పతకాలు సాధించారు. ఈ సందర్భంగా ఎంఇఒ మాట్లాడుతూ జిల్లా స్థాయి పోటీల్లో విజయం సాధించి మండలానికి మంచి పేరు తీసుకువచ్చారని, మున్ముందు రాష్ట్ర స్థాయిలోనూ కూడా విజయం సాధించాలని కోరుతూ విజేతలను అభినందించారు. కార్యక్రమంలో ఐఇఆర్‌టి ఎస్.రమణమ్మ, విద్యార్థులు పాల్గొన్నారు.

మున్సిపాలిటీ, గ్రామీణ ప్రాంతాలకు గోధుమ పిండి

ప్రజాశక్తి - పార్వతీపురం

జిల్లాలో పార్వతీపురం, పాలకొండ, సాలూరు మున్సిపాల్టీ, గ్రామీణ ప్రాంతాలకు పోర్టిఫైడ్ చక్కీ గోధుమ పిండిని సెప్టెంబరు నుండి సరఫరా చేయడం జరుగుతోందని జాయింట్ కలెక్టర్ ఆర్. గోవిందరావు తెలిపారు. ఈ మేరకు శుక్రవారం ఒక ప్రకటన విడుదల చేశారు. పార్వతీపురంలో 11,325, పాలకొండలో 7,890, మరియు సాలూరులో 13,736 వెరసి మున్సిపాలిటీలోగల 32,951 తెల్ల కార్డుదారులకు ఒక్కొక్క కార్డుకు కిలో 16 చొప్పున గోధుమ పిండి పంపిణీ చేస్తున్నామన్నారు.

కంబరలో ఫ్యామిలీ డాక్టర్

ప్రజాశక్తి - వీరఘట్టం

మండలంలోని పరిధి కంబరలో శుక్రవారం 104 ఆధ్వర్యంలో ఫ్యామిలీ డాక్టర్ కార్యక్రమం నిర్వహించారు. స్థానిక ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యాధికారి పి.ఉమా మహేశ్వరి వివిధ రకాల రోగులకు తనిఖీలు నిర్వహించి మందులు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో 104 సిబ్బంది ,ఆశా కార్యకర్తలు, పాల్గొన్నారు.

చెరువులను పరిశుభ్రంగా ఉంచాలి

ప్రజాశక్తి-బొబ్బిలి

చెరువులను పరిశుభ్రంగా ఉంచాలని మున్సిపల్ చైర్మన్ సావు వెంకట మురళీకృష్ణ కోరారు. శుక్రవారం పాతబొబ్బిలి చెరువును ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ చెరువు గట్టుపై మొక్కలు నాటి రక్షణ కోసం కంచె ఏర్పాటు చేయాలన్నారు. చెరువులు, పరిసర ప్రాంతాల్లో వ్యర్థాలు వేయకుండా చూడాలన్నారు. మున్సిపాలిటీలో వైసిపి పాలకవర్గం వచ్చిన తర్వాత రూ.5 కోట్లకు పైగా ఖర్చు చేసి అభివృద్ధి పనులు చేశామన్నారు. పాతబొబ్బిలిలో రూ.2 కోట్ల వరకు ఖర్చు చేసినట్లు చెప్పారు. గడపగడపకు మన ప్రభుత్వం నిధులు ప్రతి సచివాలయానికి రూ.20 లక్షలు మంజూరైనట్లు తెలిపారు. అనంతరం వార్డుల్లో పర్యటించి పారిశుధ్య పనులను పరిశీలించారు. కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ ఎస్.శ్రీనివాసరావు, కౌన్సిలర్ చోడిగంజి రమేష్, మున్సిపల్ మేనేజర్ శివప్రసాద్, ఎఇతదితరులు పాల్గొన్నారు.

పక్కాగా వైద్య పరీక్షలు

ప్రజాశక్తి - పాలకొండ, వీరఘట్టం

ఫ్యామిలీ డాక్టర్ ప్రోగ్రాం ద్వారా గ్రామీణ ప్రజలకు ఆరోగ్య తనిఖీలు, నిర్ధారణ పరీక్షలు పక్కాగా జరపాలని జిల్లా వైద్య, ఆరోగ్య శాఖాధికారి డాక్టర్ బి.జగన్నాథరావు సూచించారు. వీరఘట్టం మండలం వండువలో ఫ్యామిలీ డాక్టర్ కార్యక్రమాన్ని జిల్లా వైద్య ఆరోగ్యశాఖాధికారి శుక్రవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. రికార్డులు పరిశీలించి ఏ విధమైన అనారోగ్య సమస్యలున్నా వారికి తనిఖీలు చేపట్టి చికిత్స అందజేస్తున్నారు. నిర్ధారించిన పరీక్షల నివేదికలు పరిశీలించి సిబ్బందికి తగు ఆదేశాలిచ్చారు. తనిఖీలకు వచ్చిన గర్భిణీలు, బాలింతలతో మాట్లాడి వైద్య సిబ్బంది అందజేస్తున్న ఐరన్, కాల్షియం మాత్రలు వారు సూచించిన క్రమంలో వేసుకోవాలని, అంగన్వాడీ కేంద్రంలో అందజేస్తున్న పోషకాహారాలను సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. 104 వాహనం వద్దకు వచ్చే రోగులకు ఎసిసిడి, సిడి ఐడి నంబర్లు ఇచ్చేలా చూడాలని, రక్తపోటు, మధుమేహం గల వారికి పక్కాగా పరీక్షలు నిర్వహించి, నెలకు సరిపడా మందులు అందజేయాలని సూచించారు. ఇతర రుగ్మతలతో వచ్చే రోగులకు యూరిన్, కఫం పరీక్షలు జరిపి మందులు ఇవ్వాలని ఆదేశించారు.

డ్రైడే పరిశీలన

పాలకొండ పట్టణ ఆరోగ్య కేంద్ర సిబ్బంది నిర్వహించిన డ్రైడే కార్యక్రమాన్ని డిఎంహెచ్ఒ డాక్టర్ జగన్నాథరావు పరిశీలించారు. వైద్య బృందంతో కలిసి ఇంటింటి సర్వేలో ఆయన పాల్గొని ప్రజలతో మమేకమై దోమలు పెరగకుండా ఎటువంటి జాగ్రత్తలు పాటించాలో, డ్రై-డ్రైడే కార్యక్రమ ఉద్దేశ్యం



వైద్య సిబ్బందికి సూచనలు ఇస్తున్న డిఎంహెచ్ఒ జగన్నాథరావు

ప్రజలకు వివరిస్తూ దోమల లార్వాలు పెరగకుండా ఇంట్లోని పూలకుండీలు, టబ్బులు, పగిలిపోయిన వస్తువులు, ఫ్రిడ్జ్‌లో నిల్వ ఉన్న నీటిలో దోమలు గుడ్లు పెట్టి, వృద్ధి చెందుతాయని అన్నారు. వారానికి కనీసం ఒక్కసారైనా నిల్వ ఉన్న నీటిని పారబోసి శుభ్రపర్చి, దోమల వ్యాప్తిని నివారించి మలేరియా, డెంగీ మొదలగు వ్యాధులను అరికట్టవచ్చన్నారు. కార్యక్రమంలో బిటివాడ పిహెచ్‌సి వైద్యాధికారి డాక్టర్ నితీష, సూపర్ వైజర్ ఇందిరాదేవి, డెమో వై.యోగీశ్వరరెడ్డి, ఎస్‌యుఒ మోహనరావు, సూపర్ వైజర్లు జగదీష్, రమణమ్మ వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

లంకెల చెరువు ఆక్రమణపై దర్యాప్తు చేయాలి

ప్రజాశక్తి - కురుపాం

మండల కేంద్రమైన కురుపాంలో గల లంకెల చెరువు ఆక్రమణపై దర్యాప్తు చేయాలని గిరిజన అభ్యుదయ సంఘం ఉమ్మడి జిల్లాల అధ్యక్షులు ఆరిక చంద్రశేఖర్, ట్రైబల్ రైట్స్ ఫోరం జిల్లా అధ్యక్షులు ఐ.రామకృష్ణ డిమాండ్ చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఆక్రమణకు గురవుతున్న లంకెల చెరువుపై అధికారులు ఎందుకు పట్టించుకోవడం లేదని, ఆక్రమణకు పాల్పడిన వారిపై ఎందుకు ఉదాసీనంగా ప్రవర్తిస్తున్నారని ప్రశ్నించారు. కళ్ల ముందే అక్రమాలు జరుగుతున్నా అధికారులు చూసీ చూడనట్లు వ్యవహరిస్తున్నారని విమర్శించారు. ఆ చెరువు విస్తీర్ణం పరిశీలించి ఆక్రమణ చేసి వారిపై చర్యలు తీసుకోవాలని లేనిచో ఉన్నతాధికారులకు ఫిర్యాదు చేస్తామని హెచ్చరించారు.



అభివృద్ధి పనులకు శంకుస్థాపన చేస్తున్న ఎమ్మెల్యే జోగారావు

పైపులైను పనులకు శంకుస్థాపన

ప్రజాశక్తి - పార్వతీపురం టౌన్

మున్సిపాల్టీలో పరిధిలో గల మద్దాలవారి వీధిలో ఎన్నో ఏళ్లుగా స్థానిక ప్రజలను పట్టిపీడిస్తున్న మంచినీటి సమస్యకు పరిష్కారం చూపే దిశగా ఎమ్మెల్యే అలజంగి జోగారావు కొత్త పైప్ లైన్ పనులకు శుక్రవారం శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మద్దాల వారి వీధిలో (బొగ్గుల వీధి) చేసిన తాగునీటి పైపులైను పనులనందున స్థానిక ప్రజలు నిత్యం మంచి నీటికి ఇబ్బంది పడుతుండటంతో ఆ వార్డు ప్రజల సమస్యలను గత కాలంలో నిర్లక్ష్యం చేశారని, గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో స్థానిక ప్రజలు తమ దృష్టికి తీసుకు వచ్చారని, వెంటనే స్పందించి నూతన పైపులైను ఏర్పాటు చేసేందుకు నిధులు మంజూరు చేశామన్నారు. అలాగే వార్డులోని పలు వీధుల్లో సిసి రోడ్లు, కాలువల నిర్మాణం చేపట్టేందుకు అధికారులకు ఆదేశాలు జారీ చేశామన్నారు. వార్డు ప్రజలకు ఇచ్చిన మాట ప్రకారమే అన్ని అభివృద్ధి పనులను క్రమ పద్ధతిలో పూర్తి చేస్తున్నట్టు తెలిపారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్ పర్సన్ బోను గౌరీశ్వరి, వైస్ చైర్ పర్సన్ కొండపల్లి రుక్మిణి, వైస్ చైర్మన్ యిండుపూరి గుణేశ్వరరావు, పట్టణ పార్టీ అధ్యక్షులు కొండపల్లి బాలకష్ణ, ఫ్లోర్ లీడర్ మంతిని రవికుమార్, కౌన్సిలర్లు నిమ్మకాయల సుధీర్, ఎస్.లావణ్య, వై.త్రినాథ, మున్సిపల్ కమిషనర్ జె.రామ అప్పలనాయుడు, ఎఇ ఆనంద కుమార్, గుత్తేదారు డి.తిరుపతి రావు, వార్డువాసులు పాకల సన్యాసిరావు, గొర్లి వెంకటరమణ, కార్యకర్తలు, వాలంటీర్లు, స్థానిక ప్రజలు తదితరులు పాల్గొన్నారు.

జ్యూట్ కార్మికుల దీక్షలకు టిడిపి మద్దతు

ప్రజాశక్తి - సాలూరురూరల్

15 నెలలుగా మూతబడిన జీగిరాం జ్యూట్ మిల్లును వెంటనే తెరవాలని, కార్మిక జెఎసి చేపట్టిన దీక్షలకు టిడిపి పొలిట్‌బ్యూరో సభ్యులు గుమ్మడి సంధ్యారాణి మద్దతు ప్రకటించారు. శుక్రవారం ఆమె దీక్షా శిబిరం వద్దకు చేరుకొని, కార్మికులకు మద్దతు తెలిపారు. వైసిపి అధికారంలోకి వస్తే మూతపడ్డ జ్యూట్ మిల్లులను తెరిపిస్తామని హామీ ఇచ్చిందని, ఈ హామీ నిలబెట్టుకోలేదని విమర్శించారు. జిల్లాలో ఉన్న ఏకైక జ్యూట్ మిల్లును కూడా కాపాడుకోలేని స్థితిలో నేడు వైసిపి ప్రభుత్వం ఉందన్నారు. కార్మికుల ఉపాధి దృష్ట్యా ఈ మిల్లును నడిపేందుకు, తెరిచేందుకు ప్రభుత్వం, యాజమాన్యం, కృషి చేయాలని డిమాండ్ చేశారు.



కార్మికుల దీక్షలకు సంఘీభావం తెలుపుతున్న టిడిపి నాయకులు సంధ్యారాణి

కార్మికులు చేపట్టే దీక్షకు టిడిపి సంపూర్ణ మద్దతు ఇస్తుందని తెలిపారు. కార్యక్రమంలో టిడిపి పట్టణ అధ్యక్షులు నిమ్మాది తిరుపతిరావు, నడిమింటి రామకష్ణ, కసినబోయిన వెంకటరమణ, ఆర్.సింహాచలం, కె.శ్రీను, గోపి ఉన్నారు.

కోడి కత్తి డ్రామా వైసిపిదే

ప్రజాశక్తి-విజయనగరం కోట

కోడికత్తి కేసులో తెలుగుదేశం పార్టీ తనపై కుట్ర చేస్తున్నట్లు జెడ్‌పి చైర్మన్ మజ్జి శ్రీనివాసరావు మాట్లాడటం హాస్యాస్పదంగా ఉందని విజయనగరం పార్లమెంట్ నియోజకవర్గ టిడిపి అధ్యక్షులు కిమిడి నాగార్జున అన్నారు. శుక్రవారం అశోక్‌బంగ్లాలో విలేకర్లతో మాట్లాడుతూ కోడికత్తి కేసులో జెడ్‌పి చైర్మన్ చేసిన వ్యాఖ్యలను తీవ్రంగా ఖండించారు. ఆ వ్యాఖ్యలు చేసిన న్యాయవాది కోసం మాట్లాడటం మానేసి టిడిపని ఇందులోకి లాగడమేమిటని ప్రశ్నించారు. ఆరోపణలు ఎదుర్కొంటున్న జంపల్లి శ్రీనివాసరావుకి ఎన్‌ఒసి ఇవ్వకుండా అడ్డుకుంటున్నారని, ఓ దళిత యువకుడు నాలుగున్నర ఏళ్లుగా జైల్లో మగ్గిపోతున్నాడని గుర్తు చేశారు. పలు కేసుల్లో నిందితులుగా ఉన్న జగన్, అవినాష్ మాత్రం బెయిల్ మీద తిరుగుతున్నారని విమర్శించారు.కోడి కత్తి కేసులో ముఖ్యమంత్రి జగన్ ఎందుకు న్యాయస్థానానికి వెళ్లడం లేదని ప్రశ్నించారు. కోడి కత్తి డ్రామా ఆడినది వైకాపాయేనని, దీన్ని తెదేపా మీద నెట్టి అధికారంలోకి వచ్చారని ఆరోపించారు. రాష్ట్రంలో వైసిపి పాలనతో ప్రజలంతా విసిగిపోయారని.. జగన్‌మోహన్‌రెడ్డిని ఎంత త్వరగా గద్దె దించాలో ఎదురు చూస్తున్నారని అన్నారు.ఉమ్మడి విజయనగరంలో సీట్లన్నీ తామే గెలుస్తామని వెల్లడించారు. సమావేశంలో పార్టీ నాయకులు జిల్లా ప్రధాన కార్యదర్శి ఐవిపి రాజు, అరకు పార్లమెంటు ఉపాధ్యక్షులు గొట్టాపు వెంకటనాయుడు, బొద్దుల నర్సింగరావు, గంటా పోలినాయుడు, ఆల్తి బంగారుబాబు తదితరులు పాల్గొన్నారు.

లారీ పరిశ్రమకు స్థలం కేటాయించాలి

బొబ్బిలి : స్థానిక గ్రోత్ సెంటర్లో లారీ పరిశ్రమ యూనిట్‌కు స్థలం కేటాయించాలని బొబ్బిలి లారీ ఓనర్స్, వర్కర్స్ యూనియన్ అధ్యక్ష, కార్యదర్శులు ఎన్.వేణుగోపాల్, జి.భాస్కరరావు.. ఎమ్మెల్యే శంబంగి వెంకట చినప్పలనాయుడుకు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ బొబ్బిలి, పరిసర ప్రాంతాల్లో లారీలపై ఆధారపడి అనేక కుటుంబాలు జీవనం సాగిస్తున్నాయన్నారు. గ్రోత్‌సెంటర్లో లారీ పరిశ్రమ యూనిట్ల ఏర్పాటుకు స్థలం కేటాయిస్తే మరికొంతమందికి ఉపాధి దొరుకుతుందన్నారు.

సిఎం సహాయనిధి చెక్కు అందజేత

తెర్లాం : మండలంలోని బూరిపేట గ్రామానికి చెందిన టి.సాంబారావు కుమార్తె కొన్నేళ్లుగా అనారోగ్యంతో బాధపడుతోంది. ఈమెకు సిఎం సహాయనిధి నుంచి రూ.2 లక్షలు మంజూరయ్యాయి. రామభద్ర పురం మండలం కొండకెంగువకు చెందిన కోట షణ్ముఖ సాయితేజకి రూ.1.20 లక్షలు మంజూరయ్యాయి.



లబ్ధిదారునికి సింఛను అందజేస్తున్న డిఆర్‌డిఎ పీడీ కిరణ్‌కుమార్

అర్హులైన వారందరికీ పింఛన్లు

ప్రజాశక్తి - గుమ్మలక్ష్మీపురం

అర్హులైన ప్రతి ఒక్కరికీ ప్రభుత్వం పెన్షన్లు అందిస్తుందని డిఆర్‌డిఎ ప్రాజెక్టు డైరెక్టర్ పి.కిరణ్ కుమార్ అన్నారు. గుమ్మ లక్ష్మీపురం పంచాయతీలో కొత్తగా మంజూరైన 15 మంది లబ్ధిదారులకు పింఛన్లు పంపిణీ చేశారు. మరో 8మంది పింఛన్ దరఖాస్తుదారుల వివరాలు పరిశీలించారు. కార్యక్రమంలో ఎంపిడిఒ సాల్మన్ రాజు, వైస్ ఎంపిపి నిమ్మక శేఖర్, సర్పంచ్ బి.గౌరీశంకరరావు, విఆర్‌ఒ కృష్ణారావు, సచివాలయం సిబ్బంది ఉన్నారు.

పాఠశాల ఆవరణలో టేకు చెట్లు మాయం


ప్రజాశక్తి- పార్వతీపురం రూరల్

మండలంలోని గంగాపురం పంచాయతీ పరిధిలోని హిందూపురం ప్రాథమిక పాఠశాల ఆవరణలో ఉన్న ఏడు టేకు చెట్లు, మరో రెండు వేరే జాతికి చెందిన చెట్లను ఎలాంటి అనుమతులు లేకుండా నరికి తరలించినట్లు స్థానికులు తెలిపారు. సాధారణంగా పాఠశాల ఆవరణలో ఉన్న చెట్లను తొలగించడానికి స్కూల్ మేనేజ్మెంట్ కమిటీ తీర్మానించి, ఎంఇఒ ద్వారా రెవెన్యూ ఫారెస్ట్ అధికారులకు తెలియజేసి వారి అనుమతులు తీసుకోవాల్సి ఉంటుంది. అలాగే ఫారెస్ట్ అధికారులు చెట్లు విలువను నిర్ధారించి వేలంపాట వేసిన తర్వాత వేలంపాటలో నెగ్గిన వారికి చెట్లను స్వాధీనపర్చి ఆ మొత్తాన్ని ప్రభుత్వానికి జమ చేయాల్సి ఉంటుంది. కానీ హిందూపురం పాఠశాల ఆవరణలో ఉన్న టేకు చెట్ల విషయంలో ఎటువంటి నిబంధనలు పాటించకుండా, స్వప్రయోజనం కోసం పాఠశాల ప్రధానోపాధ్యాయులు మీసాల శ్రీనివాసరావు దౌర్జన్యంగా, ఎవరికీ తెలియచేయకుండా ఈ చెట్లను తరలించినట్లు, శుక్రవారం ఈ సంఘటనపై స్పందించిన గ్రామస్తులతో పాటు పంచాయతీకి చెందిన మాజీ సర్పంచి తిరుపతిరావు ఆరోపించారు. ఈ ఘటనపై విద్యాశాఖ అధికారులు జోక్యం చేసుకొని విచారణ నిర్వహించి హెచ్‌ఎంపై తగు చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.

600 కొత్త పింఛన్లు మంజూరు

ప్రజాశక్తి - సీతానగరం

మండలానికి కొత్తగా 600 పింఛన్లు మంజూరైనట్లు ఎంపిడిఒ ఎంఎస్‌ఎల్ ప్రసాద్ తెలిపారు. మొదటి విడతలో 218, రెండో విడతలో 382 పింఛన్లు మంజూరైనట్లు తెలిపారు. ఈ పింఛన్లన్నీ ఆయాగ్రామ వెల్ఫేర్ అసిస్టెంట్ల ద్వారా వెరిఫికేషన్ చేయనున్నట్టు తెలిపారు.



రోడ్డు పక్కన పిచ్చిమొక్కలను తొలగిస్తున్న సిఐ సత్యనారాయణ, ఎస్ఐ షన్ముఖరావు

సామాజిక సేవలో పోలీసులు

ప్రజాశక్తి - గుమ్మలక్ష్మీపురం

పోలీసులంటే కేవలం శాంతిభద్రతలే కాదు .. సామాజిక సేవలో మేము కూడా భాగస్వాములమే అని చాటి చెబుతున్నారు ఎల్విన్ పేట పోలీసులు. ఇందులో భాగంగా మండలంలోని ఎల్విన్‌పేట నుంచి డుమ్మంగి వరకు ఆర్‌అండ్‌బి రహదారికి ఇరువైపులా ఏపుగా పెరిగిపోయిన పిచ్చి మొక్కలను, చెట్లను జెసిబి సాయంతో తొలగించారు. సుమారు పది కిలోమీటర్లు వాహనదారులు ఇబ్బందులకు గురికాకుండా ముందస్తు జాగ్రత్త చర్యగా జంగిల్ క్లియరెన్స్ చేసినట్లు సిఐ సత్యనారాయణ తెలిపారు. ఆర్ అండ్ బి అధికారులు చేయాల్సిన పనిని కూడా పోలీసులు చేయడంతో ప్రజలు అభినందిస్తున్నారు. రోడ్డు ప్రమాదాలు జరగకుండా చూడాల్సిన ఆర్‌అండ్‌బి అధికారులు ఎక్కడ ఉన్నారో తెలియని పరిస్థితి ఉందని గతం నుంచి ప్రజలు విమర్శిస్తూనే ఉన్నారు. అయినా నేటికీ వారు స్పందించకపోవడం విచారకరం. కార్యక్రమంలో ఎస్ఐ షణ్ముఖరావు, పోలీస్ సిబ్బంది ఉన్నారు.

సిపిఎస్ రద్దుచేయాలని నిరసన

ప్రజాశక్తి-రామభద్రపురం

సిపిఎస్‌ను రద్దుచేసి ఒపిఎస్‌ను తక్షణమే పునరుద్ధరించాలని ఫ్యాప్టో నాయకులు జెసి రాజు ఆధ్వర్యాన ఉపాధ్యాయులు నల్లరిబ్బన్లు ధరించి ప్లకార్డులతో నిరసన చేపట్టారు. సిఎం జగన్ ఇచ్చిన హామీ మేరకు సిపిఎస్‌ను రద్దు చేయాలని వారు డిమాండ్ చేశారు. ప్రత్యామ్నాయంగా జిపిఎస్‌ను తెస్తామని ప్రభుత్వం చెపుతున్నా ఎట్టి పరిస్థితుల్లోనూ అంగీకరించేది లేదని స్పష్టంచేశారు. కార్యక్రమంలో ఫ్యాప్టో సభ్యులు నాగభూషణం, కృష్ణంనాయుడు, రెడ్డి వేణు, శివున్నాయుడు తదితరులు పాల్గొన్నారు.


'టిడిపితోనే ప్రజల భవిష్యత్తుకు గ్యారెంటీ'

ప్రజాశక్తి - కురుపాం

చంద్రబాబు తోనే మహిళలకు, రైతులకు, యువతకు న్యాయం జరుగుతూ ప్రజల భవిష్యత్తుకు గ్యారెంటీ ఉంటుందని టిడిపి నియోజకవర్గ ఇన్చార్జి టి. జగదీశ్వరి అన్నారు. శుక్రవారం నియోజకవర్గ కేంద్రమైన కురుపాంలో చంద్రబాబు నాయుడు ప్రతిష్టాత్మకంగా తీసుకొని ప్రవేశపెట్టిన బాబు ష్యూరిటీ - భవిష్యత్తుకు గ్యారెంటీ అనే కార్యక్రమంపై ఇంటింటికి వెళ్లి పథకంపై ప్రజలకు అవగాహన కల్పించారు. కార్యక్రమంలో మండల కన్వీనర్ కెవి కొండయ్య, టిఎన్‌ఎస్‌ఎఫ్ రాష్ట్ర మీడియా కోఆర్డినేటర్ సుకేష్ చంద్ర పండా, నాయకులు ఆకుల రమేష్, గుర్రాల గవరయ్య, సీర త్రినాథ తదితరులు పాల్గొన్నారు .

గరుగుబిల్లి : మండలంలోని గిజబలో బాబు ష్యూరిటీ - భవిష్యత్తుకు గ్యారెంటీ కార్యక్రమంలో కురుపాం నియోజకవర్గం తెలుగుదేశం ఇంచార్జ్ తోయక జగదీశ్వరి పాల్గొన్నారు. కార్యక్రమంలో మండల టిడిపి అధ్యక్షుడు అక్కేన మధుసూదన్ రావు, ఎంపిటిసి సభ్యులు ఎం.సింహాచలం, మాజీ సర్పంచ్ ఎం.కృష్ణంనాయుడు, ఎం.రాంబాబు తదితరులు పాల్గొన్నారు.

గుమ్మలక్ష్మీపురం : మండలంలోని దిగువమండలో బాబు ష్యూరిటీ భవిష్యత్తుకు



కురుపాంలో ఇంటింటి ప్రచారం చేస్తున్న టిడిపి నియోజకవర్గ ఇన్‌ఛార్జి జగదీశ్వరి



సీతానగరం : లక్ష్మీపురంలో ర్యాలీ చేస్తున్న టిడిపి నాయకులు విజయచంద్ర, జగదీష్

గ్యారెంటీ కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో కురుపాం నియోజకవర్గ టిడిపి ఇన్‌ఛార్జి తోయక జగదీశ్వరి, జనరల్ సెక్రెటరీ పోలూరు శ్రీను, అరకు పార్లమెంటు కార్యదర్శి తాడంగి రామారావు పాల్గొన్నారు.

సీతానగరం : మండలంలోని లక్ష్మీపురంలో శుక్రవారం బాబు ష్యూరిటీ భవిష్యత్తు గ్యారంటీ అనే కార్యక్రమం టిడిపి ఆధ్వర్యంలో నిర్వహించారు. ముందుగా గ్రామంలో ఊరేగింపుగా వెళ్లి ర్యాలీ నిర్వహించిన అనంతరం బహిరంగ సభ నిర్వహించారు. ఈ సందర్భంగా టిడిపి రాష్ట్ర అధికార ప్రతినిధి ద్వారపురెడ్డి జగదీష్, నియోజకవర్గ ఇన్చార్జి బోనాల విజయచంద్ర మాట్లాడుతూ రాబోయే ఎన్నికల్లో టిడిపి పార్టీని గెలిపించుకొని చంద్రబాబు నాయుడును సిఎం చేయాల్సిన బాధ్యత మనందరిపై ఉందని, తనను ఎమ్మెల్యేగా గెలిపించాలని కోరారు. కార్యక్రమంలో ద్వారపరెడ్డి శ్రీదేవి, మండల అధ్యక్షులు కొల్లి తిరుపతిరావు, మండల కమిటీ నాయకులు సాల హరిగోపాలరావు, సబ్బన్న శ్రీనివాసరావు, పి.శ్రీనివాసరావు, పార్టీ నాయకులు వి.గొంపస్వామి, యోగిరెడ్డి భాస్కరరావు, దాసరి సింహాచలం, గ్రామ కమిటీ నాయకులు సప్ప సుధాకర్, గవర భాస్కరరావు, పువ్వుల బాల గౌరీశ్వరరావు, చంద్ర ఉమామహేశ్వరరావు, చప్ప సింహాచలం, అల్లు శ్రీనివాసరావుతో పాటు 40 కుటుంబాల వరకు తెలిపి పార్టీలో చేరికలు జరిగాయి.

నేరాలు ఘోరాలు

రైలు ఢీకొని కుమారుడు మృతి, తల్లికి తీవ్రగాయాలు

ప్రజాశక్తి -పార్వతీపురంరూరల్

గూడ్స్ రైలు ఢీకొని వ్యక్తి మృతి చెందిన సంఘటన శుక్రవారం పార్వతీపురం బెలగాం రైల్వే స్టేషన్లో చోటుచేసుకుంది. జిఆర్పి పోలీసులు తెలిపిన వివరాలిలా ఉన్నాయి. పార్వతీపురం పట్టణానికి చెందిన హరి అనే యువకుడు తనతల్లితో కలిసి ఇంటికి వెళ్లేందుకు రైల్వే ట్రాక్ దాటుతుండగా విశాఖపట్నం నుంచి రాయగడ వెళ్తున్న గూడ్స్ రైలు ఢీకొంది. ఈ సంఘటనలో హరి అక్కడికక్కడే ప్రాణాలు కోల్పోగా, తన తల్లికి తీవ్ర గాయాలయ్యాయి.

రైలు ఢీకొని వ్యక్తి మృతి

ప్రజాశక్తి - కురుపాం



బంధువుల ఇంటికి వెళ్లి తిరిగి రైల్వే స్టేషన్‌కు వస్తున్న సమయంలో ప్రమాదవశాత్తు రైలు ఢీకొని వ్యక్తి మృతి చెందిన ఘటన కొమరాడ మండలంలో చేటుచేసుకుంది. రైల్వే హెడ్ కానిస్టేబుల్ రత్నాకర్ అందించిన వివరాలు ప్రకారం కురుపాం మండలంలోని శివ్వన్నపేటకు చెందిన కొండేటి గౌరీశంకరరావు (39) కొమరాడ మండలం గుమడలో ఉన్న తన బంధువుల ఇంటికి వెళ్లి తిరిగి రైల్వేస్టేషన్‌కు వస్తున్న సమీపంలో రైలు ఢీకొని అక్కడిక్కడే మృతి చెందాడు. వెంటనే కుటుంబ సభ్యులకు తెలిపి, మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం జిల్లా ఆసుపత్రికి తరలించినట్లు తెలిపారు. ఆయన భార్య, ఇద్దరు పిల్లలు ఉన్నారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పేర్కొన్నారు.